# 22. ఉంగరం

వాసును చూడగానే అతనితో స్నేహం చేయాలనే కోర్కె కలిగిందనటంకన్న, అతని వేలినవున్న ఆ ఉంగరం చూడగానే నాకా కోర్కె కలిగిందనటం న్యాయం. రెండు మూడు రోజులుగా ఏదో పని కల్పించుకొని అతనికి దగ్గరగా జరుగుతూ ఎంతో పరీక్షగా ఆ ఉంగరాన్ని చూస్తు వొచ్చాను. నేను ఇందుకోసమే అతనికి దగ్గరగా వుంటున్నాననే అనుమానం ఎవరికీ కలగకుండా తగిన జాగర్త తీసుకున్నాను. ఉంగరం నేను అనుకున్నదేననే విషయంలో మరెట్టి సందేహాలు లేవు.

అది గొప్ప విలువైన ఉంగరమని ఎవరూ అనుకోరు. అందుకనే నాకు ఆ ఉంగరం విషయంలో కలిగిన ఆతృత మరెవరికీ కలిగేందుకు వీల్లేదు. సాధారణపుటుంగరం; దానిమీద పద్మం – పద్మాన్ని జేరాలని ప్రయత్నించే తుమ్మెద ఎనామిల్ పెయింటు చేయబడింది. ఎంతజేసినా యీ రోజుల్లో అది ఎనభయి రూపాయిల విలువకుమించి ఉండదు. మరి యీ స్వల్పసాధారణపు వస్తువుకు నేను గొప్పవిలువను ఆపాదించేందుకుగల కారణమల్లా ఆ ఉంగరం వెనుక ఒక గొప్ప గాథ ఉండటమే!

ఉంగరాన్ని చూసినప్పుడల్లా – ఎనిమిదేళ్ళనాటి ప్రణయ ఘట్టాలు నా కళ్ళముందు మెరిసేవి. రెండు సంవత్సరాల జీవితమంతా ఒక్క క్షణంలో ఇమిడి నన్ను కదిలించివేసేది. పద్మ, ఆమెను ప్రేమించి నేను, ఆ చిన్నవయస్సుకు ఎవర్నీ, దేన్నీ కూడా లెక్క చేయకుండా ప్రతిరాత్రీ ఆమెను కలుసుకునేందుకు దొంగకన్న చాకచక్యంగా ఇంట్లోంచి బైటపడి, మెల్లిగా వాళ్ళ ఇంటిలోకి జొరబడేవాణ్ని.

ఇది కనిపెట్టి నాన్న నా వీపులోని ఎగుడు దిగుళ్ళు సర్దుబాటు చేసినా, ఇదంతా ఆ పద్మకోసమేననే తియ్యని తలపు నన్ను ఊరడించింది. ఇలాటి కష్టాలన్నీ మా ప్రణయబంధాన్ని మరింతగా బిగించినవి. ఎంతమంది నన్ను అవమానించినా, తిట్టినా కొట్టినా నేను లెక్క చేయలేదు. చివరకు యీ గోలనంతనూ భరించలేక పద్మకూడా కొన్నాళ్ళపాటు ఎడపెడగా వుందామని సలహా చెప్పింది. కాని నేను భరించలేక పిల్లవాడివలె ఏడ్వగానే, ఆమె తల్లి వలె ఊరడించింది. అదొక దివ్యప్రణయం. దానిజీవితం రెండు సంవత్సరాలే అయినప్పటికీ ఆ తియ్యని తలపుల కొత్తదనం కనీసం రెండు శతాబ్దాలవరకయినా వుంటుంది. ప్రతిరోజూ పద్మనూ, పద్మ తోడి సౌఖ్యాన్ని తలుచుకోవటంతో ఎంతో ఆనందం కలిగేది...ఆ సందర్భంలోనే నేను నానా అవస్థపడి, దొంగిలించి ఇప్పుడు వాసు ధరించిన ఉంగరంలాటిదాన్నే - కాదు - దీన్నేనేమో! ఆమెకు బహూకరించాను.

ఆ తరువాత నేను చదువుకోసమని పట్టణం జేరటం, ఆమె గృహకల్లోలాలలో వేరొకపట్టణం జేరటం జరిగింది. ఆమె ఎక్కడ వున్నదీ, ఏం చేస్తున్నదీ, ఎలావున్నదీ తెలుసుకోవాలని విశ్వప్రయత్నం చేశాను. కాని ఆమెను గూర్చి వివరాలు నాకు యీనాటివరకూ తెలియవు. యీ దీర్ఘ వియోగంలోకూడా నేనామెను మరిచిపోలేదు. అనుకుంటాను - నన్ను కూడా ఆమె మరిచిపోయి ఉండదని. దూరాన వున్నప్పటికీ మా అనురాగానికి ఎలాంటి ఆటంకమూ కలగ లేదనే వలపు తీపి నన్ను కైపెక్కిస్తుంటుంది.... నాటికి నేడుగా యీ ఉంగరం కనిపించడంతో నా మనస్సు ఆందోళన పట్టసాగింది.

ఇది అలాటి ఉంగరమే ఎందుకు కాకూడదనే అనుమానం నాకు కలుగకపోలేదు. కాని సరిగ్గా అలాటి అభిప్రాయమే వేరొకరికి కలిగివుంటుందనేది అనుమానించాల్సిందే. అదీగాక నేనీ ఉంగరాన్ని ఆమెకు బహూకరించిన మూడోనాడు మేడమెట్లమీద జారటంవల్ల ఆమె చెయ్యి గీసికొని పోయింది. దాంతోపాటు ఉంగరంమీది బొమ్మమీద అడ్డంగా ఒక సన్ననిచార స్పష్టంగా పడిపోయింది. వాసు ధరించే యీ ఉంగరంమీద కూడా అదేచార ఉండటంతో నాకు మరే సందేహమూ కలగకుండా ఇది పద్మకు నేనిచ్చిన ఉంగరమేనని దృఢపడింది.

వాసుతో స్నేహం చేద్దామనే నిశ్చయం ఎంత త్వరగా నాలో ప్రవేశించిందో, స్నేహం చేయటం అంతత్వరగా జరిగేదిగా కనిపించ లేదు. అతను చాలా ముభావంగాను ఇతరులతో తనకు పనిలేనట్లుగానూ ఒంటరిగా కూర్చొని, ఏదో చదువుకుంటూంటాడు. యెప్పుడయినా పేకాటలోకి జొరబడతాడు. క్లబ్‌లో ఎవరితోనూ అతనికి గాఢమైత్రి వున్నట్లు నాకు తోచలేదు. స్నేహంమాట దేవుడికెరుక - ముందు పరిచయమన్నా కావాలి కదా! ఎట్లా?

ఒక రాత్రి సినిమాచూసి వొస్తున్నాను. నడిరోడ్డు మీద పెద్దగందరగోళం – బోలెడంతమంది జనం గుమికూడి వుండటంచూసి ఆతృతకొద్దీ అక్కడికి వెళ్ళాను. వాసు బట్టలన్నీ బురద కొట్టుకొని ఉన్నవి. అతని పక్కగా సైకిల్ బురదలో దొర్లుతోంది. జట్కా వాడితో ఘర్షణ జరుగుతోంది. జట్కా బహుశా వాసుకు తగలటంవల్ల అతను బురదలో సైకిల్‌తో సహా పడివుంటాడు. జట్కావాడు తన తప్పును ఒప్పుకోకుండా దబాయిస్తున్నాడు. ఎవరి తప్పయినప్పటికీ వాహనం, వాహనంతోపాటు శరీరమూ చెడిన వ్యక్తిమీద సానుభూతన్నా చూపవలసిన బాధ్యత ఎదుటివ్యక్తికి వుంది. జట్కా వాడి సంస్కారానికి ఆ సానుభూతిని కోరటం మన సంస్కారానికీ తగనిపని. దీన్ని గ్రహించకుండా వాసు వాడితో పోట్లాడటం నాకు సమంజసంగా తోచలేదు. పైన జేరిన జనం యీ వినోదాన్ని చూస్తున్నారేకాని, ఎవ్వరూ యీ పోట్లాటను సర్దేందుకు ప్రయత్నించటంలేదు సరికదా తమ అమూల్యాభిప్రాయాల్ని కూడా బయల్పరచటంలేదు. ఇంక బాగుండదని సర్దాను. పోలీసులు వొస్తే మరింత రసాభాస అవుతుందని నచ్చజెప్పి జట్కావాణ్ని పంపేశాను.

వాసు దాదాపు నడవలేని స్థితిలో వున్నాడు. జనం బాగా పల్చబడ్డారు. బురదకొట్టుకొన్న సైకిల్‌ను నేనే చేతబట్టుకున్నాను. వాసును రిక్షాలో ఎక్కించి మెల్లిగా వాళ్ళింటికి జేర్చాను.

దారిలో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. తన అవమానాన్ని చూసి నేను ఆనందిస్తున్నానని వాసు బాధపడుతున్నాడేమో? ఏమయినా వాసుతోడి స్నేహంమాట ఎలా వున్నా ముఖపరిచయం వున్న వ్యక్తికి ఇలాటి ఆపదలో సహాయపడవలసిన నా కనీసధర్మాన్ని మరిచిపోదలచలేదు. ఇంటికి జేర్చాక "మీరు నన్ను ఎరుగుదురా?" అన్నాడు వాసు.

"ఎరుగుదును...నేను కూడా క్లబ్‌లో మెంబర్నే" అన్నాను.

"అట్లాగా?" అన్నాడు.

"డాక్టర్ను కబురు చెయ్యమంటారా?" అన్నాను.

"ఎందుకండీ – పెద్దగాయాలేమీ తగలలేదు. కాలుకాస్త బెణికింది. వెధవ! రాంగ్‌సైడు తోలాడు. మీరు వెళ్ళండి మీకు చాలా ఆలస్యమయినట్లుంది పాపం – చాలా శ్రమ పెట్టాను" అన్నాడు వాసు.

"ఇంతమాత్రానికే...."అని సెలవు తీసుకున్నాను.

రెండు రోజులదాకా వాసు క్లబ్‌కు రాలేదు. నాకు ఆతృత యెక్కువయి వాళ్ళింటికి వెళ్ళాను. అతను పడక కుర్చీలో పడుకొని పుస్తకం చదువుతున్నాడు. నన్ను చూడగానేలేచి "దయచెయ్యండి" అని ఆహ్వానించాడు.

పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ "ఎలావుందోనని చూసిపోదామని వొచ్చాను" అన్నాను.

"బెణికిందన్నానుకదూ! ప్రస్తుతం తోమిస్తున్నాను, మరో రెండు మూడు రోజులన్నా తోమించాలి. కదలటంవల్ల మంచిదికాదని ఇంట్లోనే వుంటున్నాను..." అని నౌకర్ని పిలిచి కాఫీ ఫలారాలు తెమ్మన్నాడు.

నేను వొద్దంటూన్నా లెక్క చెయ్యలేదు.

"చూడండి. క్లబ్‌కు వస్తే ఎలాగో కాలక్షేపం జరుగుతుంది. కాని యీ నాలుగుగోడలమధ్యా బొత్తిగా తోచకుండా వుంది, తమకు వీలుంటే రెండు మూడు రోజులపాటు ఇక్కడికి వొస్తే కాస్త కాలక్షేపం జరుగుతుంది. కేరమ్స్ ఆడుకోవొచ్చు. లేదా పేక, లేదా చదరంగం-లేదా ఏవో కబుర్లు చెప్పుకుందాం - ఏమంటారు?"

"ఓ అలాగే!" అన్నాను సంతోషంతో.

అంతే. అదే మొదలు వాసుతోటి స్నేహం. జీవితంలో ప్రమాదవశాత్తూ మిత్రులూ, శత్రువులూ కూడా వొచ్చి పడతారనేది అక్షరాలా నిజం! అందులోనూ తనకు ఆపదలో అడ్డుపడటమేగాక, నమ్మదగిన మిత్రుడుగా ప్రవర్తించే నన్ను వాసు ప్రత్యేకాభిమానంతో చూడటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

స్నేహం అనవసరమనుకొని దూరదూరంగా ఉండే వ్యక్తుల్లో ఒక ప్రత్యేకత వుంది. అధవా స్నేహమంటూ కలవాలికాని వారు చాలా కొద్ది వ్యవధిలోనే ప్రాణస్నేహితులవుతారు. యీ తత్వం వాసులో రుజువయింది.

రెండువారాలు గడిచేప్పటికి చిరకాలస్నేహంలాటిది ఏర్పడిపోయింది. ఒకోనాడు వారింట్లోనే భోజనంచేసి తెల్లగా తెల్లారేవరకూ మాట్లాడుకుంటూ కూర్చోవటంవరకూ మా స్నేహం సాగింది. 'మీరు' అనటం 'నువ్వు' అనటంగా మారింది.

ఇక ఉంగరాన్ని గూర్చి అడగటానికి పరిపక్వదశ వొచ్చిందనే నమ్మకం నాకు కలిగింది.

"ఎన్నాళ్ళనుంచో అడగాలనుకుంటున్నాను, నీ వేలినవున్న వుంగరం - ఎంతో బాగుంది...ఎక్కడ కొన్నావు? ఎంతకు కొన్నావు?" అన్నాను, ఒకనాటి రాత్రి.

వాసు తనలో తను నవ్వుకోవటం, అతని ముఖంలో ఏవో జరిగిపోయిన గాథల తాలూకు తరంగాలు దొళ్ళటం నాకు స్పష్టంగా కనిపించినవి. తనను తాను సంబాళించుకునేవరకూ నేను వూరుకున్నాను.

రెండు నిమిషా లయ్యాక, అప్పుడే నిద్రమేల్కొన్నట్టుగా మరోసారి తన వేలివంక చూసుకొని "ఇదా? ఇది నేను కొనలేదు..." అన్నాడు.

"మరి? ఎక్కడయినా దొరికిందాయేం?"

"ఎబ్బే. మనకు పోగొట్టుకునే అలవాటేకాని దొరికే అలవాటు బొత్తిగాలేదు...ఇది ఒకరు బహూకరించారు" అన్నాడు.

"ఎవరూ?" అన్నాను ఆదుర్దాగా. అన్నాక అడగరాని ప్రశ్న వేశానని సందేహం కలిగింది. నాలుక జారాక, దాన్ని ఉపసంహరించుకోవటం, ఒక పొరపాటును దిద్దుకోబోయి మరోపొరపాటు చేయటం లాటిదని గుర్తుకొచ్చి, జవాబుకోసం వేచికూర్చున్నాను.

వాసు మళ్ళీ తనలో తాను నవ్వుకున్నాడు.

'నీకు తెలియదు...ఆమె పేరు పద్మ!' అన్నాడు.

నేను గతుక్కుమన్నాను. మొదటినుంచీ నేనీవిషయాన్ని అనుమానిస్తూనే వున్నాను. ఇక్కడ అదే దృఢపడటంతో ఏమీ నిరాశ కలగలేదుకాని...యీ కథ వేరొక విధంగా ఉన్నట్టయితే నా వూహ సరైనదికాక, నా తెలివితక్కువ తనమే రుజువయినప్పటికీ నాకెంతో తృప్తిగా వుండేది. ఆ ఉంగరం ఏ రోడ్డుమీదనో ఇతనికి దొరికినా నాకంత బాధగా వుండేది కాదు. పద్మ బహూకరించిందనటంతో నా ప్రణయం ఎంత బలహీనమైనదో అర్థమైపోయింది. ఇన్నాళ్ళ వలె ఆమెను ఇలవేల్పువలె తలపోసి ఆనందించేందుకు మరెలాటి అవకాశమూ ఉండేందుకు వీల్లేదు. నా ఆనందాన్నంతటీన్నీ యీ స్నేహం ఇలా మట్టిపాలు చేస్తుందని కలలో కూడా తలపోయలేదు..ఇంకా వివరాలు అడగటం ఎలాగా అని ఆలోచిస్తున్నాను. ఆమె పేరుమీద ప్రశ్న వేయటం స్నేహానికి భంగకరమని తెలియకపోలేదు.

"ఏం – ఆమె నీకూ తెలుసాయేం?" అన్నాడు వాసు బహుశా నా ముఖంలోని మార్పును గమనించి.

"ఉహూఁ నువ్వలా ఎందు కనుకున్నావు?"

"ఏమో – అట్లా అనిపించింది–"

"ఎవరండీ ఆమె?"

"ఏమో, ఆమె పుట్టుపూర్వోత్తరాలు నాకూ అంత బాగా తెలియవు. తెలుసుకోవాలని ఎన్నడూ ప్రయత్నించలేదు...కాని స్త్రీత్వమంటే ఆమె దగ్గరే నాకు బాగా అర్థమైంది. ఆమె ప్రేమంటారా ఇనుపసంకెళ్ళలోనుంచయినా తెంచుకొని బైటపడటం దుస్సాధ్యం, అలాటి ప్రయత్నం జరుగుతే – తన్నుకొన్నకొద్దీ ఉరితాడు బిగిసినట్లుగా ఆమె ప్రేమపాశం మరింతగా బిగుస్తుంది."

తెలిసిందా అన్నట్లు నా వంక చూశాడు.

"అంత గాఢంగా ప్రేమించిందా?" అన్నాను

"గాఢమా?" అన్నాడు వాసు. "తలుచుకుంటే ఏడుపొస్తుంది. అదెక్కడి గాఢతరమండీ బాబోయ్! ఒక పంజరంలో బంధించబడినట్లుగాను ఎప్పుడూ తనదగ్గరే వుండాలి. ఇతరులను చూడరాదు. మాట్లాడరాదు. నాకు వూపిరాడేది కాదంటే నమ్ము!"

గాఢంగా ప్రేమించటాన్ని వాసు ఏవగించుకుంటున్నాడేమో అనిపించింది. అతను చెప్పదలచుకున్నది - సరిగ్గా అంటే నాకు బాగా అర్థమయేట్లు చెప్పలేకపోతున్నా డనిపించింది.

"నీకు అర్థంకాదు. అలాటి ప్రేమను నేను కోరలేదు. నేను సామాన్య మానవుణ్ణి. ప్రణయం ఎంత పవిత్రమైనదైనా అది జీవితానికి ఎంత అవసరమైనదయినా - జీవితమంతా ప్రణయమే అయితే - ప్రణయం మినహాగా మరేమీలేకుంటే నువ్వు భరించగలవా?"

అతని ప్రశ్నకు నేను జవాబిచ్చే స్థితిలో లేను. ఎందుకంటే అతని హృదయాన్ని సీరియస్‌గా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను.

"ఎంత తీపయినా మొహం మొత్తదూ?" అన్నాడు. యీ సారన్నా అర్థమయి తీరుతుందన్న నమ్మకంతో నాలోకి చూస్తూ.

ఔను, తియ్యగావుంటేమాత్రం ఎంతపని? అంతు ఉండొద్దూ? బహుశా పద్మ ఇతనికి పిచ్చెక్కేంతవరకూ ప్రేమించి ఉండాలి.

"అర్థమయింది. తరువాత కథ చెప్పండి."

"కథ ఏముందీ? ప్రతి ప్రణయకథ మల్లేనే - ఇక మా ప్రణయం ఆఖరు కావాల్సినపరిస్థితి దానంతటదే ఏర్పడింది. ఎంతవిలాస మయినప్పటికీ ఆడది మొగాడికి గుదిబండయితే - ఆ బరువును వొదుల్చుకోక తప్పేదేముందీ?"

"ఎలా వొదిలించుకున్నావు? ఆమె మిమ్మంత త్వరగా వెళ్ళనిచ్చిందా!"

"ఆమె ఇష్టాయిష్టాలతో ప్రసక్తి తెచ్చుకుంటే నాకు యావజ్జీవ కారాగారవాస శిక్ష ఖాయపడేది! మొదట్లో ఆమె ప్రణయాన్ని ఎంత మెచ్చుకున్నానో రానురాను అంత ఏవగించుకున్నాను ... చెప్పకుండా చెయ్యకుండా బట్టలన్నా తీసుకోకుండా ఉడాయించాను."

"ఆ తరువాత మళ్ళీ కలుసుకోలేదన్న మాట?"

"ఒక్కసారి కలుసుకున్నాను. రెండేళ్ళ తరువాత మెద్రాస్‌లో సినిమాహాల్లో - ఎవరో ఐశ్వర్యవంతుడయిన యువకుడితో పాటు ఆమె కూర్చొనివుంది. మొగాడు ఆమెపక్కనే ఉన్నాడు కనుక మనకు భయంలేకపోయింది, లేకుంటే ఆమెనుచూడగానే పరుగెత్తేవాణ్ని. అతను ఎవరో ఏమిటో నాకు తెలియదు. తెలుసుకోవాలనీలేదు. పద్మ నా పాలిట బ్రహ్మరాక్షసి. ఆమె బ్రహ్మరాక్షసత్వాన్ని అరికట్టేందుకు యీ యువకుడు

సంసిద్ధు డయినందుకు పురుషప్రపంచం తరఫున అతన్ని అభినందించాను...కాని అతను యీమెతో పడే బాధ నాకు బాగా అనుభవం వుంది కనుక ఒక విధంగా సానుభూతి చూపాలికూడాను."

కాస్త ఆగాడు - సరిగా ఏం జరిగిందో జ్ఞాపకం చేసుకుంటూన్నట్లు.

"వాళ్ళకంటపడకుండా వెళ్ళి దూరాన కూర్చున్నాను. రెండో ఆట కావటంవల్ల జనం ఎక్కువగాలేరు..కాని ఆమె నన్ను ఎప్పుడు చూసిందో ఏమిటో - చప్పున నవ్వుకుంటూ వొచ్చి నా పక్క కుర్చీలో కూర్చుంది.

'బాగున్నారా?' అందామె.

తుళ్ళిపడ్డాను. ఆమెనుచూసి భయపడికాదు - ఆ యువకుడు ఏమనుకుంటాడో, ఏం రసాభాస అవుతుందోనని!

'అఁ ఇప్పుడు ఎవరి దగ్గర ఉంటున్నావ్?' అన్నాను- ఆడదానికి మొగాడు ఆధారంలేకుండా ఉఁడగలగట మనేది యీ సమాజంలో సాధ్యమవదనే సత్యంలాగా తెలిసివుంది.

'అడుగో చూడు - ఆ గుడ్లగూబ దగ్గర - ఆయనే నా భర్త!' అందామె - మా వెనుకవున్న అతనికేసి అసహన భావంతో చూపుతూ. ఆ భావం అర్థంగాక ఆ యువకుడు తననేదో అభినందిస్తున్నదని పొరబడి, చిరునవ్వు వొలకబోశాడు.

'ఏమయినా అనుకుంటాడు' అన్నాను.

'ఏమిటి అనుకునేది? నేనంటే ఆయనకు అమితభక్తి భయంకూడాను, తెలిసిందా?'

'నాతో ఇలా మాట్లాడుతూంటే-?'

'చెప్పే వొచ్చాను పాతస్నేహితుణ్ని పరామర్శించి వొస్తానని. ఏమయినా అంటే లేచిపోతానని ఆయన భయం. అందుకని తన ఆస్తిపాస్తులతో నన్ను కట్టెయ్యాలని విశ్వ ప్రయత్నం చేస్తూంటాడు."

ఆమె నగకట్టూ, చీరె మొదలయినవి చూసినప్పుడే నేనీ సంగతి గ్రహించాను. పద్మజీవితం అధోగతి పాలవుతుందనీ - ఆమె ఏ వ్యభిచారిణిగానో జీవితాన్ని గడుపుతూండి వుంటుందనీ అనుకున్నాను. కాని ఆమె ఇల్లాలు అయినందుకు నాకెంతో ఆశ్చర్యం కలిగింది.

సినిమా మొదలయింది; ఇక ఆమె వెళ్ళిపోతుందనుకున్నాను. కాని ఆమె కబుర్లు చెపుతూ నా పక్కనే కూర్చుంది.

'ఇప్పుడు హాయిగా ఉన్నావా?' అన్నాను.

"తగలెయ్...జీవితంలో ఎప్పుడూ ఏదో వొకలోటు ఉండాల్సిందే. అన్నిముచ్చట్లూ తీరితే ఇక జీవించాల్సిన అవసరంమాత్రం ఏముందీ? ఎప్పుడూ ఏదో వొకలోటు ఉండాలికదా!'

'ఏమిటా లోటు?' అన్నాను.

ఆయనలాటి భర్తను అంగీకరించేందుకు నా తత్వం బొత్తిగా ఒప్పదు. ఏంమనిషి? మంచికారును జాగర్తగా వాడుకున్నట్లు, భార్యను కాలుకింద మోపనీక పూజిస్తానంటాడు. అదే ప్రేమ అంటాడు. ప్రేమకూ, భక్తికీ భేదం అతనికి తెలియదు. నేను తెలియజెప్పదలచలేదు. ఎందుకంటే యీ భర్తని ఎలాగో భరిస్తున్నానుకాని, అతని ప్రేమను మాత్రం భరించలేను-'

'ఎందుకనీ?'

'ఎందుకా? తాను నన్ను ప్రేమిస్తున్నట్లు చెప్పగానే నేను అంతకన్న యెక్కువగా ప్రేమిస్తున్నట్లు చెప్పాలి. అంతేకాదు, ఆ ప్రేమను వ్యక్తపరచాలి. అప్పుడు కాని అతను తృప్తి పడడు. అతను తృప్తిపడేందుకు నేను యీ డొంక తిరుగుడు పద్ధతిని అవలంబించలేను-'

'ఎలాగో యీడుచుకొని వొస్తున్నా వన్నమాట?'

'అంతే-ఇతరవిధాల తృప్తిపడుతున్నాను. నువ్వు నమ్మవుకాని నేను జీవితంలో నిన్ను తప్ప మరెవ్వరినీ ప్రేమించలేదు. ప్రేమించలేనుకూడాను... నే నెప్పుడైనా నీకు జ్ఞాపకంవొచ్చానా?' అందామె. ఆ చీకట్లోకూడా ఆమె ముఖంలోని ఆతృతను నేను గ్రహించాను.

నిజానికి ఆమె అనేకసార్లు జ్ఞాపకానికి వొచ్చింది. కాని ఆమె తలిచే విధానంలో కాదు, ఆమె నాలో రేకెత్తించిన భయంవల్ల ఆమె తలపుకురాగానే దాన్ని సాగించేందుకు భయపడి మనసు మళ్ళించుకునేవాణ్ని. కాని యీ సోదంతా ఆమెకు చెప్పదలచలేదు.

'అనేకసార్లు...నే నెప్పుడయినా జ్ఞాపకానికి వొచ్చానా?'

'ప్రతిరోజూ - ప్రతిరోజూ అంటే నమ్మవుకదూ?' అందామె. ఆమె కంఠంలో విచారం ఉట్టిపడుతూవుంది. శృతి మించి రాగానపడి ఇప్పుడామె మళ్ళీ నా వెంట పడుతుందేమోననే భయం తిరిగి నన్నావరించింది.

ఆ తరువాత ఆమె ఎంతో చెప్పాలనుకున్నట్టుంది. కాని ఆమె ఉద్రేకం ఒక్కమాటనుకూడా పయికి రానీలేదు. గాఢమయిన ఉచ్ఛ్వాసనిశ్వాసాలద్వారా ఆమె భావనలు, ఆమె అవస్థా నాకు అర్థమయినది. మూడునాలుగు నిమిషాలయాక ఆమె తన చెక్కిలిని నా ముఖంమీదికి జరిపింది. ఆమె కన్నీటివేడి నాకు తగిలింది...కాని ఆమె నానుంచి ఏం కోరుతోందో అర్థమవలేదు. ఆమెను ఎలా సముదాయించాలో

అంతుపట్టలేదు. ఆ చీకట్లో ఆమె ఎంతో అప్యాయంగా ముద్దుపెట్టింది...ఇంకేం రసాభాస అవుతుందోనని అదిరిపోతున్నాను.

'ఎప్పుడన్నా మా యింటికి రారాదా?' అంది. యీ కంఠస్వరం మామూలు ధోరణిలోనే వుండబట్టి నాకు కొంత ఉపశాంతి కలిగింది.

'మీ ఆయన ఏమన్నా అనుకుంటాడేమో?'

'ఆయన ప్రసక్తి ఏముందీ? నే నాయన్ను ఆజ్ఞాపించగలనంటే నమ్మవా?'

'సరే వొస్తాను –' అన్నాను. ప్రస్తుతానికి తప్పించుకుంటే ఆ తరువాత చూసుకోవొచ్చని.

'వాసూ! నీ కోసం ఎంత తపించాను! ఎంత వెదికాను! ఎంతమంది కాళ్ళు పట్టుకున్నాను! అంతా మారిపోయింది. ఒక విధంగా నాకు అన్యాయం జరిగిందనుకునేదాన్ని, కాని యీనాడు సామాజికంగా నా స్థానం చూసుకుంటే నాకు గర్వంగాకూడా వుంటుంది. కాని వ్యక్తిగతంగా జీవితం నాకంత రుచికరంగా లేదు.'

నేనేమీ మాట్లాడలేదు.

'రేపు మా ఇంటికి రావా?' అందామె.

'తప్పక–' అన్నాను.

ఆమె ఎడ్రస్ ఇచ్చింది.

'ఎక్కడుంటున్నావూ?' అందామె.

భయపడి తప్పు ఎడ్రస్ ఇచ్చాను.

'నా గుర్తుగా ఇదివుంచు...' అని ఆమె నా వేలికి యీఉంగరాన్ని తొడిగింది.

చీమ చిటుక్కుమన్నా వినపడేటంత నిశ్శబ్దత వాతావరణంలోకి దూకింది. నేను స్తంభించిపొయ్యానేమో ననిపించింది. అతనుకూడా మాట్లాడటంమాని తనలోతాను నవ్వుకుంటున్నాడు.

"ఆ తరువాత మళ్ళీ వెళ్ళావా?"

"మళ్ళీనా? నీకు మతిపోతోంది. సెక్స్‌కూ ఆకలికీ చాలా దగ్గరి సంబంధంవుంది. తిండి ఎక్కువయితే అజీర్తి పుట్టినట్లే, ప్రణయం ఎక్కువయితే మానసికంగానూ, శారీరకంగానూ కూడా అజీర్ణం పుడుతుంది. ఆ ప్రణయమే విషంగా మారి దహించేస్తుంది..."

"తిరిగి ఎక్కడా ఆమెను కలుసుకోలేదన్నమాట?"

"అలా కలుసుకోకుండా కాపాడమని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూంటాను – తెలిసిందా?" అన్నాడు వాసు.

నేను పద్మను గాఢంగా ప్రేమించాను. అందుకనే నా జ్ఞాపకంగా ఆమెకు ఆ ఉంగరాన్ని బహూకరించాను. ఆమె వాసును గాఢంగా ప్రేమించింది. అందుకనే ఆ ఉంగరాన్ని వాసుకు బహూకరించింది. నేనూ, ప్రస్తుతం ఆమె భర్తా ఒకేస్థితిలో వున్నాం. పద్మ విలువ మాకు తెలుసు. కాని యీ వాసు ఆమె ఎంత కోరినా దూర దూరంగా వుండి ఆమెను గాయపరచటమే కాకుండా, ప్రణయాన్నే అవమానించాడు. ఇతని సంస్కారం సందేహాస్పదమయినదిగానే తోచింది.

"ఆమె నిన్నంత గాఢంగా ప్రేమిస్తే ఆమెకు అన్యాయం చేశావ్!" అన్నాను.

"న్యాయమో అన్యాయమో! స్త్రీ మనస్ఫూర్తిగా ప్రేమిస్తే తట్టుకోలేవ్. ప్రణయం ఒక రెండెడ్లబండిలాటిది. ఒక ఎద్దు మరీ బలమయినదయితే రెండోఎద్దు ప్రాణానికి మోసకారిగానే పరిణమిస్తుంది" అన్నాడు వాసు.

"యీ సంగతి ఆమెకు చెప్పి ఉండాల్సింది."

"ఆమెకా? ఆమె పిచ్చిది. ఆమె ప్రణయపువేడికి వందేళ్ళ జీవితం పదోవొంతుకు దిగుతుంది. ఒక్కటి గుర్తుంచుకో...ఎదుటివ్యక్తి భరించలేనంత ప్రేమ ఎప్పుడూ పనికిరాదు. నాకన్న ఆమె భర్త లక్షరెట్లు నయం. అతనంటే ఆమెకు ఇష్టంలేదు. ఏదో సంసార పక్షంగా సాగిపోతోంది ...అంత కన్న ఎక్కువ కావాలని ఆమె భర్త కోరడు-ఎందుకంటే, తాను తృప్తిపడుతూన్నప్పుడు, ఇంకా కావాలనటం మౌఢ్యం. ఇక నా సంగతంటావా- ఆమె ఇనుప ప్రణయంలో నాకు వూపిరాడదు. అలాటిది నాకు వొద్దనేవొద్దు-"

"మొత్తంమీద ఆమెకు అన్యాయం జరిగిందనే విచారం నీకు లేదనుకుంటాను" అన్నాను.

"ఆమెపట్ల నీకు సానుభూతి వుంది. మంచిదే! కాని నాకు జరిగిన అన్యాయం సంగతేమిటి? ఆమెను నేను ద్వేషించలేదు. ఇప్పటికీ ప్రేమించగలను.' కాని దానికి ప్రతిఫలంగా ఆమె బాహువులు నన్ను మరి కదలనీయవు. ఆ నరకం నాకు వొద్దు...యీ ఉంగరాన్ని చూసినప్పుడల్లా ఒక గొప్ప ప్రమాదంనుంచి తప్పుకున్నాననే విజయగర్వం కలుగుతూంటుంది -" అని ఆ ఉంగరంవంక గర్వంగానే చూశాడు.

వాసు తత్వం నాకు బాగా అర్థంగాక తెల్లమొహం వేశాను. కాని ఆ వెన్నెట్లో నా ముఖంలోని తెలుపును ఇతరులెవ్వరూ గ్రహించలేదు!

*- మే 1952*